క్లుప్తంగా

వార్డుల్లో కమిషనర్ పర్యటన



సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. టీబీ రోడ్డు ఒకటో డివిజన్ పారిశుద్ధ్య కార్మికుల మాస్టర్ పాయింట్‌ను కమిషనర్ సందర్శించారు. అలాగే మున్సిపల్ నాలుగో డివిజన్‌లోని మలేరియా మాస్టర్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. గాంధీ పార్కు వెనుక చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. కేహెచ్ఎం వీధిలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించి సిబ్బందికి కమిషనర్ సూచనలు చేశారు. ఎస్కే గ్రాండ్ ఎదురుగా కన్‌స్ట్రక్షన్ అండ్ డేమలిష్ వేస్ట్‌ను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, వి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పరామర్శ



ఖాజాపీర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మేస్త్రి ఖాజాపీర్ తల్లి రసూల్‌బీ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళి అర్పించి ఖాజాపీర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తొగటవీరక్షత్రి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చౌడం రవిచంద్ర, జాకీర్, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డిని కలిసిన ముస్లింలు



విశ్వనాథరెడ్డిని సన్మానించిన ముస్లింలు

పోరుమామిళ్ల : కనుమ పండుగ రోజు పట్టణ ముస్లిం సోదరులు పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎస్.విశ్వనాథరెడ్డిని బుధవారం కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలతో ఆయన్ను సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు, వచ్చే ఎన్నికల్లో మరోకసారి తిరుగులేని మెజారిటీతో గెలుపొందేందుకు అందరూ సహకరించాలని విశ్వనాథరెడ్డి కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ సుందరీకరణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. పండుగ నాడు కూడా అంకితభావంతో రాత్రి విధులు నిర్వర్తిస్తున్న పలువురు పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం రాత్రి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య, పారిశుద్ధ్య పరిరక్షణలో కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి సేవలను ప్రతిఒక్కరూ గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు మూర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మాంసం విక్రయదారులకు జరిమానా

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని మాంసం దుకాణాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తనిఖీ చేశారు. కల్తీ మాంసం విక్రయిస్తున్న నాలుగు మాంసం దుకాణ యజమానులకు ఆయన రూ.12 వేలు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంతు వధశాల (ప్రైవేట్) పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారులకు సూచించారు. ప్రజారోగ్య సిబ్బంది మాంసం దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది గురుప్రసాద్, నాగేష్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయల విగ్రహావిష్కరణ

మైదుకూరు : మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం సాయంత్రం శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించారు. గతంలో చిన్న విగ్రహం స్థానంలో నిలువెత్తు రాయల విగ్రహాన్ని కొద్దిరోజుల కిందట ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



పెన్నానదిలో పార్వేట ఉత్సవంలో పూజలందుకుంటున్న గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు



అల్లాడుపల్లెలో పార్వేటకు బయలుదేరిన వీరభద్రస్వామి, భద్రకాళిమాత




ఆకులనారాయణపల్లెలో చౌడేశ్వరిదేవి గ్రామోత్సవం



రాజుపాళెం: గోపాయపల్లెలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



ప్రొద్దుటూరు : పార్వేట ఉత్సవంలో శ్రీప్రసన్న వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులు



వెదురూరులో ప్రత్యేక అలంకరణలో పార్వతి దేవి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను వాహనంపై కొలవుదీర్చి ఆలయ సమీపంలోని మైదానంలో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. పార్వేట సందర్భంగా కుందేలును వదలారు. ఈ వేడుకను తిలకించేందుకు బొల్లవరంతోపాటు పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు చేరుకోవడంతో ఆ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.

స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి, సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

■ రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కనుమ సందర్భంగా గంగాగౌరి సమేత ముక్తి రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పెన్నానదిలో పార్వేట ఉత్సవం చేశారు.

■ మండలంలోని నరసింహాపురంలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై పెన్నానదిలోకి తీసుకెళ్లారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి ప్రసాదం పంపిణీ చేశారు.

ఘనంగా పార్వేట మహోత్సవం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కామనూరు గ్రామంలో బుధవారం ప్రసన్న వేణుగోపాలస్వామి పార్వేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని శ్రీప్రసన్న వేణుగోపాల స్వామి, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కామనూరు మొదలుకొని రాధానగర్, గోపులాపురం, ఎర్రబల్లె, పెద్ద అగ్రహారం, బుక్కాయపల్లె, చిన్న అగ్రహారం, మాచనపల్లె గ్రామాల మీదుగా స్వాములు వారి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ గ్రామాల్లోని ప్రజలు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రవితేజ చెక్క భజన బృందం వారు పార్వేట ఉత్సవంలో నిర్వహించిన చెక్కభజన అందరిని ఆకట్టుకుంది. పార్వేట ఉత్సవంలో స్వామివారు తిరిగి గురువారం ఉదయం కామనూరు గ్రామానికి చేరుకుంటారు. పార్వేట ఉత్సవంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గుర్రంపై తిరగడం అందరిని ఆకట్టుకుంది.

రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు

స్థానిక సూపర్ బజార్ వీధిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొనగా ప్రథమ స్థానంలో సౌమ్య, ద్వితీయ స్థానంలో కవిత, తృతీయ స్థానంలో శివప్రియ నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ స్వాతి, మగ్గం వర్క్ టీచర్ లక్ష్మీదేవి వ్యవహరించారు. కార్యకర్మంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, డ్యాన్సర్ మహి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వెల్లాల పార్వేట ఉత్సవం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో మకర సంక్రాంతి పండుగను పురుష్కరించుకొని మంగళవారం పార్వేట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ కేవీ.రమణ, ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హనుమద్వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను, నంది వాహనంపై గంగాదేవి పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. వెల్లాల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు గోపాయపల్లె, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మల్లెవేముల, దద్దనాల, పగిడాల, కుమ్మరపల్లె, పర్లపాడు గ్రామాల మీదుగా సాగింది. ఆ గ్రామాల్లో ప్రొద్దుటూరుకు చెందిన సీతారాముల చెక్కభజన కళాకారుల బృందం చేసిన నృత్యం, పాటలు అందరిని అలరించాయి. గోపాయపల్లెకు ఉత్సవ విగ్రహాలు రాగానే పెద్దసంఖ్యలో మహిళలు, ప్రజలు భజన పాటలు పాడుకుంటూ ఘన స్వాగతం పలికారు. పార్వేటలో ఎటువంటి గొడవలు జరగకుండా రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, పెద్ద సంఖ్యలో ఆయా గ్రామస్తులు, మహిళలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం

మండలంలోని టంగుటూరు గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామోత్సవం, పార్వేట మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో నంది వాహనంపై సోమేశ్వరస్వామి, వీరభద్రస్వామి, పార్వతీదేవి, అలాగే మదనగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేశారు. ఈఓ కె.రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వాములకు గ్రామస్తులు, మహిళలు, ప్రత్యేక పూజలు చేశారు. జమ్మలమడుగు వారిచే కాంతార కార్యక్రమం, ప్రొద్దుటూరు వారిచే చెక్కభజన అందరిని అలరించాయి. అలాగే మంగళవారం సాయంత్రం దువ్వూరు మండలంలోని మురళీనగర్ మహిళల బృందం చేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది.

ఘనంగా పార్వేట మహోత్సవం

చాపాడు : గ్రామాల్లో సంక్రాంతి, కనుమ వేడుకను ఘనగా జరుపుకొన్నారు. వెదురూరులో పార్వతి దేవి అమ్మవారు గ్రామోత్సవం, అల్లాడుపల్లెలో వీరభద్ర స్వామి, భద్రకాళిమాత, చియ్యపాడులో లక్ష్మీచెన్నకేశవ స్వామి పార్వేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లెలో జరిగిన వేడుకలో ఆలయ చైర్మన్ వీరనారాయణ యాదవ్, ఈఓ మారుతి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల ఊరేగింపు

బద్వేలు అర్బన్ : పాడిపంటలు అభివృద్ధి చెంది ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని స్థానిక అబ్బరాతివీధి, గాంధీనగర్‌లోని మహిళలు వేర్వేరుగా సంక్రాంతి సందర్భంగా గొబ్బెమ్మల పండుగ నిర్వహించారు. గత 5 రోజులుగా గొబ్బెమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించగా బుధవారం గొబ్బెమ్మలను ఊరేగించారు. గొబ్బెమ్మలను నిలిపి మహిళలు పాటలు పాడారు. ఊరేగింపు సందర్భంగా స్థానిక మహిళలు గొబ్బెమ్మలకు నీరు వారపోసి స్వాగతం పలికారు. ఈ ఊరేగింపు వెంట మహిళలంతా రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు

కలసపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో ఉల్లాసంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. లింగారెడ్డిపల్లెలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెల్లపాడు కోలాట గురువు ప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులు వేసిన కోలాటం అలరించింది. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో పారువేట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్‌ను మోతాదిరెడ్లు సన్మానించారు.

బహుమతుల ప్రదానం

పోరుమామిళ్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా పోరుమామిళ్ల పోలీస్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఇండోర్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో మెగా షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి 40 టీమ్‌లు పాల్గొన్నాయి. సోమవారం ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన జట్లకు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ నగదు బహుమతితోపాటు మెమెంటోలు అందజేశారు. పోరుమామిళ్లకు చెందిన రాజా, చరణ్ టీమ్ ప్రథమ స్థానం, గిద్దలూరుకు చెందిన ప్రణయ్, మాలిక్ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన వెంగమాంబ పాఠశాల కరస్పాండెంట్ పుల్లప్పనాయుడు, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలవెంకటరెడ్డి, వెంకటేశ్వర విద్యాసంస్థలకు మెమెంటోలు అందచేసి సత్కరించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి గ్రామోత్సవం

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె, గొంటువారిపల్లె గ్రామాల్లో బుధవారం కనుమ పండుగ సందర్భంగా చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పువాయిద్యాల నడుమ వైభవంగా గ్రామోత్సవం సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గ్రామోత్సవంలో పాల్గొని చౌడేశ్వరిదేవికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించుకున్నారు. నరసాపురంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను ఊరేగించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా గొబ్బెమ్మలు ప్రత్యేక పూజలందుకున్నాయి. కమలకూరు గ్రామంలో బుధవారం రాత్రి గొబ్బెమ్మలను మహిళలు, యువతులు అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి పాటలు పాడుతూ రాత్రికి బాణాసంచా పేల్చుతూ డప్పువాయిద్యాల నడుమ సమీపంలోని సగిలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా తరలి వచ్చారు.



అట్లూరు: గొబ్బెమ్మలను నిమజ్జనానికి తీసుకెళుతున్న యువతులు



ప్రొద్దుటూరు : బహుమతులు అందిస్తున్న సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి



రాజుపాళెం : టంగుటూరులో పార్వేట మహోత్సవంలో జనసందోహం



అబ్బరాతివీధిలో గొబ్బెమ్మలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు



తెల్లపాడులో కోలాట గురువుతో చిన్నారులు



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌ను సన్మానిస్తున్న మోతాదిరెడ్లు



పార్వేటలో శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి



మాధవరాయుని పార్వేటలో పాల్గొన్న భక్తజనం



పత్తూరులో ప్రత్యేక పూజలందుకున్న సీతారాములు



ఆకట్టుకున్న కోలాటం



పార్వేట ఉత్సవంలో సీత సమేత కోదండరామస్వామి లక్ష్మణ, హనుమంతుడు



బహుమతులను అందిస్తున్న సర్పంచ్ నాగేంద్ర బాబు

మైదుకూరు : సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కనుమ రోజున మైదుకూరు లక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక పుష్పాలంకరణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి కొలువు దీరారు. వేద పండితుల ప్రత్యేక పూజల అనంతరం మేళ తాళాలు, తప్పెట్లు భారీ జనసందోహం మధ్య కోలాహలంగా పార్వేటకు శ్రీకారం చుట్టారు. ఆలయ చైర్మెన్ బండి బెల్లం సుబ్బరాయుడు, మాజీ చైర్మెన్ సింగయ్యగారి రామమోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్థానిక నంద్యాల రోడ్డు నుంచి స్వామివారి పార్వేట బయలుదేరగా దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. రహదారులకు ఇరువైపులా మిద్దెలు, మేడలపైకెక్కి భక్తులు పార్వేట తిలకించారు.ఈ సందర్భంగా నిర్వహించిన చెక్క భజన, కోలాటం, కేరళ నృత్యాలు, వెంకటేశ్వర కల్యాణం నాటకం, కర్రసాము, కత్తులతో పోరాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఖాజీపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పార్వేట నిర్వహించారు. సీతారామస్వామిని ఊరేగించి ప్రత్యేక జానపద నృత్యాలు, కోలాటాలు నిర్వహించారు. తవ్వారిపల్లె, కోటింగురువాయపల్లె, పత్తూరు గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఖాజీపేట టౌన్‌లోని సీతారామాలయం నుంచి స్వామిని ఊరేగించారు.

కోదండరామస్వామి పార్వేట ఉత్సవం

దువ్వూరు : పాత దువ్వూరులోని కోదండరామస్వామి పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతా సమేత కోదండరామస్వామి లక్ష్మణ, హనుమంతుడి ఉత్సవ మూర్తులను అశ్వవాహనంపై ఆశీనులను చేశారు. మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం మధ్య ఊరేగింపుగా పుల్లారెడ్డి పేటలోని లక్ష్మీ శ్రీనివాస డిగ్రీ కాలేజీ మైదానానికి తీసుకెళ్లి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, పాపినేని రాంబాబు, కొర్రపాటి వెంకటసుబ్బయ్య, శ్రీధర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో బుధవారం సంక్రాంతి వేడుక వైభవంగా నిర్వహించారు. కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట సందర్భంగా కోలాటం, కర్రసాము నిర్వహించారు. మహిళలు, పురుషులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్పంచ్ బండి నాగేంద్రబాబు బహుమతులను అందజేశారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే పుట్టా

చాపాడు : మండలంలోని వెదురూరులో సంగమేశ్వర స్వామిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బుధవారం దర్శించుకున్నారు. వెదురూరుకు వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు


ప్రొద్దుటూరు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందులలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీకి స్వీట్ ఇచ్చి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజర్ గుద్దేటి రాజారాం రెడ్డి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చల్లపల్లి రాఘవ రెడ్డి, సంజీవకర్త పాల్గొన్నారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న పోరెడ్డి నరసింహారెడ్డి, గోనా ప్రభాకర్‌రెడ్డి

బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానం

ప్రొద్దుటూరు : బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానమని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తెలిపారు. స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం తెలుగు భాషోపాధ్యాయుడు పల్లా వెంకటరామారావు రచించిన 'చిట్టి చేతులు' బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ బాలల కథలు పిల్లలకు ప్రపంచ జ్ఞానాన్ని, మంచి చెడు విచక్షణ జ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు. బాలల కోసం పల్లా రామారావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభ అధ్యక్షుడు ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ పిల్లల కథలు పిల్లల్లో నైతిక విలువల అభివృద్ధికి, సమాజం పట్ల అవగాహనకు, మంచి నడవడికకు సోపానాలుగా నిలుస్తాయన్నారు. పుస్తక రచయిత పల్లా వెంకటరామారావు మాట్లాడుతూ నేటి తరం పిల్లలు బాల సాహిత్యాన్ని చదవాల్సిన ఆవశ్యకత ఉదన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో పిల్లల్లో సృజనాత్మక శక్తి అలవడాలంటే కథా పఠనం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదు వుల బాబు, కొత్తపల్లి శ్రీను, తొగటవీరక్షత్రియ కల్యాణ మండపం కమిటీ అధ్యక్షుడు బండారు రఘురామయ్య, రచయిత కొమ్మిశెట్టి మోహన్, కవి కాశీవరపు, కవి ఏసీ దస్తగిరి, వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పల్లా శేషయ్య, కోశాధికారి బండారు సూర్యనారాయణ, పాల్గొన్నారు.



'చిట్టి చేతులు' బాలల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ప్రముఖులు

వైభవంగా అయ్యప్పస్వామి తిరువాభరణ మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామికి శబరిమలై వలే తిరువాభరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అయ్యప్పస్వామికి విశేష పూజాకార్యక్రమాలను చేశారు. మంగళవారం సాయంత్రం ఇరుముడి కట్టుకున్న అయ్యప్పదీక్షదారులు శబరిమలలో స్వామివారికి జరిగే విధంగా తిరువాభరణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అయ్యప్పస్వామి ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేసి దీక్షదారులు తలమీద ఉంచుకుని ఊరేగింపుగా శరణుఘోషల మధ్య శివాలయం చేరుకున్నారు. అక్కడ స్వామి వారి ఆభరణాలకు పూజాక్రమాలు చేసి తిరిగి, ఊరేగింపుగా అయ్యప్పస్వామికి ఆలయానికి చేరుకుని స్వామివారికి అలంకరించారు. అనంతరం అయ్యప్ప స్వామి జ్యోతి పూజ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. పూజాకార్యక్రమం కొవ్వూరు రామసుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

పోరుమామిళ్ల : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన స్వామికి అభిషేకం నిర్వహిస్తూ వస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు అభిషేక కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి చరణాలతో హోరెత్తించారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ఉత్సవాలు

ప్రొద్దుటూరు : మండలంలోని శంకరాపురం గ్రామ శ్రీలక్ష్మీ ఆండాల్ సహిత విజయ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరుప్పావై ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీత్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి శాసనములతో, తిరుమల తిరుపతి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో తిరుప్పావై ప్రవచనాలను గత నెల డిసెంబర్ 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం నండూరి రామానుజ ఫణి కుమారాచార్యులు స్వామి, తిరుప్పావై ఆవశ్యకతను, సామాజిక, మానవీయ వలువల గురించి భక్తులకు వివరించారు. గోదాదేవి పాశురాల అర్థం, విశేషార్థాలను, ఆళ్వార్ల చరిత్ర, పురాణాలు, భాగవద్గీత విశేషాలను తెలిపారు. కుచేల దినోత్సవం, కుత్తు దీపోత్సవం, అమ్మవారికి సారె సమర్పణ, పెండ్లి కుమార్తె చేయుట, భోగి పండ్లు పోయుట, గోదా దేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త గౌరు వెంకటరెడ్డి, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు.



తిరువాభరణ మహోత్సవంలో అయ్యప్ప దీక్షదారులు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



పూజలో పాల్గొన్న భక్తులు



భక్తులతో నండూరి రామానుజ ఫణి కుమారాచార్యులు స్వామి